క్లుప్తంగా

ఆలయానికి విరాళాలు



రశీదు అందజేస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ ఖైకొండాయిగూడెం క్రాస్‌లో శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణం జరుగుతోంది. ఈ సందర్భంగా పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. ఖైకొండాయగూడెంకు చెందిన కేలోత్ చందర్–లక్ష్మి రూ.25,116, ధరావత్ గవాస్కర్–తార రూ.15,116, భూక్యా శ్రీకాంత్–లక్ష్మి, గుగులోత్ శివకుమార్–లలిత, సోమా శంకర్–భవాని రూ.10,116 చొప్పున, బానోత్ రమేష్–రాధ రూ.5,116 విరాళం అందజేశారని కమిటీ బాధ్యులు తెలిపారు.

వైన్స్ షాపులను మరో చోటుకు మార్చాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వైన్స్ షాపులను ప్రస్తుతం ఉన్న చోటు నుంచి మరోచోటుకు మార్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ కోరారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన ఎక్సైజ్ ఎస్సైకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కూసుమంచి రహదారిలో వైన్స్ ఏర్పాటుతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: గౌడజన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఖమ్మం బీసీ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మందా రామారావు గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్‌గా బండి నాగేశ్వరావు, గౌరవ అధ్యక్షుడిగా మంద మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, అన్వేష్ గౌడ్, శరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సోషల్‌మీడియా అధ్యక్షుడిగా వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, అశోక్‌కుమార్, రామాంజనేయులు, వినోద్‌గౌడ్, ఉపేందర్, వీరన్న నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కావ్యచంద్‌కు పురస్కారం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని కావ్య ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కావ్యచంద్ యలమూడి నిలిచి ఉమెన్ ఎక్స్‌లెన్స్ అండ్ చేంజ్ మేకర్స్–2023 అవార్డు ఎంపికయ్యారు. మహిళా రంగంలో స్ఫూర్తిదాయకంగా, వైద్యరంగంలో చేస్తున్న విశేష సేవలకు గాను ఢిల్లీకి చెందిన షెష్పాష్ ఆర్గనైజేషన్ తరఫున టాప్–40 జాబితాలో చోటు దక్కడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. చైర్మన్ రవీందర్ యలమూడి, ప్రసూన పారుపల్లి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విగ్రహావిష్కరణ

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్.కనకయ్య స్మారక విగ్రహాన్ని శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్, సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ పాప్యానాయక్ నివాళులర్పించారు. అలాగే కనకయ్య స్మారక విగ్రహం వద్ద వైఎస్సార్‌టీపీ నాయకులు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, రామ్‌నాయక్ తదితరులు నివాళులర్పించారు.

సీపీఎస్ అంతమే పీఆర్‌టీయూ పంతం

ఖమ్మంఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయించడమే లక్ష్యంగా తమ సంఘం కృషి చేస్తోందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు తెలిపారు. ఖమ్మం రోటరీనగర్‌లో శుక్రవారం ఆయన సంఘం సభ్యత్వాలను ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే మధ్యంతర భృతిని ప్రకటించి, పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయమన్నారు. నాయకులు తిరునగరి స్వామి, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, రమణయ్య, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ వై.ఆర్.కే సతీమణి సరళాదేవి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో పాటు పులిపాటి వెంకయ్య, రాయల నాగేశ్వరావు, బాలగంగాధర్‌తిలక్, నరసింహారావు తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి, భోళాశంకర్
వినోద	జైలర్
సాయిరాం	భోళాశంకర్
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	భోళాశంకర్
సుందర్	ఉస్తాద్

– ఖమ్మంగాంధీచౌక్

కొనసాగుతున్న పనులు..

చెరువుల జలకళతో రైతులు కళకళ

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- పంటల సాగులో రైతులు బిజీబిజీ
- కూలీలకు చేతినిండా పనులు
- 'సాగర్' ఆయకట్టులో మాత్రం మందకొడిగానే..



వరినాట్లు వేస్తున్న కూలీలు



జలకళను సంతరించుకున్న గట్టుసింగారం ఊర చెరువు

కూసుమంచి: వానాకాలం మొదలై.. నెల రోజుల పాటు వర్షాలు లేకపోవడంతో రైతులు పంటల సాగు చేసేందుకు వెనకడుగు వేయాల్సి వచ్చింది. కాని గత రెండు వారాల క్రితం వర్షాలు భారీగా కురవడంతో పాలేరు డివిజన్‌లో చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి. దీంతో బోరు, బావుల్లో భూగర్భ జలాలు పెరగడంతో పంటల సాగుకు ఢోకా లేకుండాపోయింది. ఈనేపథ్యంలో రైతులు ప్రస్తుతం తమ వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు..

చెరువులు, బోరు బావుల కింద రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే సగం మంది నాట్లు పూర్తిచేసుకోగా మిగిలిన వారు ఆ పనిలో నిమగ్నమయ్యారు. పాలేరు డివిజన్‌లో ఏ గ్రామంలో చూసినా ప్రస్తుతం వరిసాగులో రైతులు బిజీగా కనిపిస్తున్నారు. దీంతో కూలీలకు చేతినిండా పని దొరుతుకుతుంది.

సాగర్ ఆయకట్టు కింద మందకొడిగా..

పాలేరు డివిజన్‌లో సాగర్ ఆయకట్టు ఉన్న కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో ఆయకట్టు పరిధిలో సాగర్ నీరు విడుదల చేయకపోవడంతో వరి సాగు బాగా వెనకబడింది. ఆయకట్టు కింద రైతులు నార్లు పోసుకుని నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. డివిజన్‌లో మొత్తం 57,631 ఎకరాల్లో వరిసాగు ఉండగా సాగర్ ఆయకట్టు కింద 30వేల ఎకరాల వరకు ఉంది. ఇక చెరువులు, బోరు, బావుల కింద మాత్రం సాగు ముమ్మరంగా సాగుతుంది.

పత్తికి అనుకూలంగా...

ఇటీవల కురిసిన వర్షాలు పత్తిపంటకు మేలు చేశాయి. వర్షాభావం పరిస్థితుల్లోనే రైతులు పత్తిని సాగుచేయగా పంట ఏపుగా పెరగలేదు. ఈక్రమంలో వర్షాలు ఊపందుకోవటంతో పత్తి పంటకు అనుకూలించి పంట ఇప్పుడు కళకళలాడుతుంది. వర్షాలు ఆగిపోవటంతో రైతులు పత్తిలో పాదులు చేసుకుంటూ ఎరువులు వేస్తున్నారు. దీంతో పత్తి కూడా ఆశాజనకంగా ఉందని రైతులు చెపుతున్నారు. పత్తితో పాటు మొక్కజొన్న, కంది, పెసర పంటల సాగును కూడా రైతులు చేపట్టారు.

చెరువులకు జలకళ..

పాలేరు డివిజన్‌లో ప్రధాన నీటి వనరు అయిన పాలేరు రిజర్వాయర్ ఇటీవల నిండి అలుగుపారడంతో డివిజన్‌లోని చెరువులన్నీ నీటితో నిండిపోయాయి. భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లటంతో వరదనీరు చెరువులకు చేరింది. దీంతో చెరువులు నీటితో కళకళాడుతున్నాయి. పాలేరు నియోజకవర్గంలో 201 చెరువులు ఉండగా వర్షాలకు 50 చెరువులు అలుగుపారాయి. 75 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. మిగిలిన చెరువుల్లో సగానికి పైగా నీరు చేరింది. వర్షాలు ఏ కొద్దిపాటిగా కురిసినా ఉన్న చెరువులన్నీ నిండిపోతాయని రైతులు చెపుతున్నారు. వానాకాలం పంటల సాగుకు ఇక ఢోకా లేనట్టేనని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగు వివరాలిలా..

పాలేరు డివిజన్‌లో వానాకాలం సీజన్‌లో ఈ నెల 11వ తేదీ వరకు వరి 20,822 ఎకరాలు, పత్తి 33,398 ఎకరాలు, మొక్కజొన్న 130 ఎకరాలు, చెరుకు 167 ఎకరాలు, పెసర 307 ఎకరాలు, కంది 84 ఎకరాలు సాగుచేశారు. సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల అయితే వరిసాగు గణనీయంగా పెరగనుంది.

ముమ్మరంగా పంటల సాగు..



గత నెలలో వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు మందకొడిగా సాగింది. కాగా వర్షాలకు చెరువులు నిండి నీటి వసతి పుష్కలంగా ఉండడంతో రైతులు సాగును ముమ్మరం చేశారు. డివిజన్‌లో పత్తి సాగు బాగానే ఉంది. వరినాట్లు ఇంకా వేస్తున్నారు. సాగర్ నీరు విడుదల చేస్తే ఆయకట్టు అంతా వరి సాగు అవుతుంది.

– విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

మంత్రి.. మార్నింగ్ వాక్!

- క్రీడా మైదానాలు, ట్రాక్‌లు పరిశీలన
- శుభ్రం చేయించాలని కేఎంసీ అధికారులకు ఆదేశం



మార్నింగ్ వాక్ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: 'బాగున్నారా.. ట్రాక్‌లు నడిచేందుకు వీలుగా ఉన్నాయా.. నడవడం ఆరోగ్యానికి మంచిది'అంటూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వాకర్లను పలకరించారు. వాడవాడకు పువ్వాడలో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం వాకింగ్ చేశారు. వాకర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే, క్రీడా ప్రాంగణాల ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులతో మాట్లాడిన మంత్రి.. స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినందున సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. స్టేడియంలో అక్కడక్కడా చెత్తను గమనించిన మంత్రి వెంటనే తీయించాలని కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరిని ఆదేశించారు. మినీ వాకింగ్ ట్రాక్‌పై గుంతలు పూడ్చించాలని చెప్పారు.

లెర్నింగ్ లైసెన్సులు పంపిణీ..

డ్రైవింగ్ రావడం ఎంత మంచిదో.. అంతే ప్రమాదకరమైందనే విషయాన్ని గుర్తించి జాగ్రత్తలు వహించాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన చేపట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో భాగంగా పలువురికి ఆయన లైసెన్సులు అందజేసి మాట్లాడారు. అందరికీ లైసెన్స్ ఉండాలని పువ్వాడ ఫౌండేషన్ ద్వారా దాదాపు 10వేల మందికి రూ.50 లక్షల వ్యయంతో ఇప్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, నగరంలోని 55, 56వ డివిజన్ వేణుగోపాల్‌నగర్‌లో మమత ఆస్పత్రి పువ్వాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆర్టీవో కిషన్‌రావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ వల్లభనేని రామారావు, ఎంవీఐ వరప్రసాద్, డీఈ రంగారావు, సీటీసీ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, కార్పొరేటర్లు మక్బూల్, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, మోతారపు శ్రావణి సుధాకర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు నూతాలపాటి నాగేశ్వరరావు, పైడిపల్లి సత్యనారాయణ, అంజిరెడ్డి, సిరిపురపు సుదర్శన్‌రావు, మచ్చా నరేందర్, కొల్లు పద్మ, తన్నీరు శోభారాణి, తాజుద్దీన్, ఇస్హాక్, బెల్లంకొండ దిలీప్ పాల్గొన్నారు.



ఉద్యోగుల సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, తదితరులు

భవనం ప్రారంభం..

ఖమ్మంఅర్బన్/ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని 10వ డివిజన్ ఇందిరానగర్‌లో నిర్మించిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ భవనాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కొడిరెక్కల లింగయ్య, కార్పొరేటర్ చావ మాధురి నారాయణరావుతో పాటు పగడాల నాగరాజు, బిక్కస్, పాషా, శ్రీను పాల్గొన్నారు. అలాగే, ఈనెల 27న ఖమ్మం జెడ్పీ హాల్‌లో జరగనున్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం సమ్మేళనం పోస్టర్లను మంత్రి అవిష్కరించారు. ఈకార్యక్రమంలో తాజుద్దీన్, లింగాల రవికుమార్, గంగాధర్, భాస్కర్ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి



రుణం చెక్కు అందిస్తున్న నవీన్‌నాయక్

ఖమ్మంగాంధీచౌక్: మహిళలు వ్యాపారరంగంలో రాణించాలనే ఉద్దేశంతోనే యూనియన్ బ్యాంక్ నారీశక్తి అనే పథకం కింద రుణాలు మంజూరు చేస్తోందని బ్యాంక్ సీనియర్ మేనేజర్ డి.నవీన్ నాయక్ అన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఖమ్మం–1 బ్రాంచ్‌లో నారీశక్తి రుణాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది రాజేష్, రజియాబేగం, వాసవి, భాస్కర్ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా సదస్సుకు నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్:కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు పర్చాలని తదితర రైతాంగ సమస్యలపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సదస్సులో పాల్గొనేందుకు ఖమ్మం నుంచి అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ హక్కుగా చట్టం చేయాలని,పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా చేయాలని, కౌలు రైతాంగానికి చట్టబద్ధహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు మారుతి మల్లయ్య, కుర్ర వెంకన్న, కేశోతు లక్ష్మణ్, ధరావతు లక్ష్మణ్, వడ్డె వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, బానోత్ శంకర్, కూరాకుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

కామేపల్లి (కారేపల్లి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కామేపల్లి ఎంపీడీఓ జయ భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలపరిధిలోని గరిడేపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మన ఊరు–మనబడి కార్యక్రమానికి సంబంధించిన పనులను పరిశీలించాక మాట్లాడారు.సర్పంచ్ ధరావత్ రాంజీ, పాఠశాల హెచ్ఎం గుడిపూడి శ్రీనివాసరావు, జర్పుల దేవ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి మాళోత్ రాజ్‌కుమార్, బట్టు నాను, మాజీ సర్పంచ్ బోడా రాంజీ పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక ఖమ్మం జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు మాట్లాడారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని, గృహలక్ష్మి కింద రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఆఫీస్ బేరర్లు శ్రీనివాసరావు, కేవీరెడ్డి, రత్తమ్మ, కృష్ణార్జునరావు, జానకిరాములు, కె.నాగేశ్వరావు, సంగయ్య, రాజ్యం, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాకు చెందిన సీనియర్ డూప్ కళాకారుడు ధరావత్ నరేష్(49) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రవి సందర్శించి కుటుంబసభ్యులకు రూ.10వేలు అందించారు. అలాగే ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీప్తి నివాళులర్పించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక కళాకారులు మొగిలి గుణకర్, ఫైర్ రవి, సాగసాయి ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన 'ఆజాదీ ర్యాలీ'

ఖమ్మం సహకారనగర్: మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన జాతీయ విద్యా విధానంపై స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు అన్నారు. నగరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆజాదీ ర్యాలీని స్థానిక మహిళ కళాశాల నుంచి గాంధీచౌక్ వరకు నిర్వహించి అనంతరం మహిళా జూనియర్ కళాశాలలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ..ప్రజల హక్కులను హరిస్తూ.. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ నూతన విద్యావిధానం తీసుకొచ్చి ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసి ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు విద్యను అందించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ అధ్యక్షత జరిగిన సభలో కార్యదర్శి తుడుం ప్రవీణ్, ఉపాధ్యక్షులు పర్వీన్, నాయకులు బెజవాడ సాయి శేషు, వీరేందర్, సరళ, సంగీత, ఉదయశ్రీ, రాగిణి నవ్య, నాయకులు శరీఫా, ప్రవంతి, శ్రావణి నిఖిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఆ భూమికీ.. మాకు సంబంధం లేదు..

కమీషన్ వ్యాపారి బానోత్ వస్రాం



భూమి పత్రాలు చూపిస్తున్న బానోత్ వస్రాం

రఘునాథపాలెం: సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హర్యాతండా రైతు గుగులోతు మంగీలాల్‌కు సంబంధించిన భూమికీ.. తమకు ఎలాంటి సంబంధం లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖమ్మం మార్కెట్ కమీషన్ వ్యాపారి బానోత్ వస్రాం తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగీలాల్ తండ్రి నందా భూమిని తాము కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు. ఈర్లపూడి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 832/ఈ3లో రెండెకరాల భూమిని అజ్మీరా లాలి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని చెప్పారు. హర్యాతండాకు చెందిన గుగులోతు నందా కుమారుడు మంగీలాల్.. తాము వారి భూమిని ఆక్రమించామంటూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. సర్వే చేయించుకొని రికార్డు ప్రకారం ఆ రైతు భూమి తమ వద్ద ఉంటే తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బానోత్ డస్రాం, బానోత్ శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు కాగా, శుక్రవారం కేసు నమోదైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రేపాలకు చెందిన అనిల్ వైరాలోని ఫెర్టిలైజర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయన ఈనెల 7న ఇంటి నుంచి వైరా వెళ్తుండగా కోదాడ క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం వైపు నుంచి ఎదురుగా కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అనిల్‌ను ఆస్పత్రిలో చేర్పించగా, ఆయన తండ్రి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: రాజ్యాధికార సాధన కోసం ఈనెల కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి, ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని అభ్యుదయ పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జెల్లా వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఖమ్మంలోని చర్చి కాంపౌండ్‌లో గల గాంధీపార్కులో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలిగేటి చంద్రమోహన్, గజేంద్రుల నాగేశ్వరావు, ఫణితేజ, ధార్న మహేష్, జిల్లా నాగేశ్వరావు పాల్గొన్నారు.

మణిపూర్‌కు సంఘీభావంగా కదలిరండి

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలను నిరసిస్తూ త్వరలో ప్రత్యామ్నాయ పౌర సమూహం(సీపీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సీపీఏ కోఆర్డినేటర్ జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలాంలు కోరారు. శుక్రవారం నగరంలోని వాహేధియా మజీద్ వద్ద సీపీఏ నిర్వహించనున్న బహిరంగ సభపై ప్రచారం చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి ఎండీ.గౌస్, సైదా, రెహమాన్, అజీజ్, కరీం, మీరా, అక్బర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న దోరేపల్లి శ్వేత, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు, వెంకన్నలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత శుక్రవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నాక మంత్రి పువ్వాడ ఆదేశానుసారం వారికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ మల్లేష్, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, మార్కెట్ హమాలీలు పాల్గొన్నారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మం అర్బన్: నగరంలోని టౌన్–4 పరిధిలో ఉన్న 33/11 కేవీ ప్రకాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ జే.శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీనివాసనగర్, ప్రకాష్‌నగర్, బెస్తకాలనీ, టీచర్స్ కాలనీ, అయ్యప్ప టెంపుల్, ఎస్‌వీఎం స్కూల్, సాయిబాబా ఆశ్రమం, సుందరయ్యనగర్, ఎఫ్‌సీఐ గాదాం రోడ్, వ్యవసాయ మార్కెట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఖమ్మంటౌన్ సెక్షన్–1 పరిధిలో 33/11 కేవీ దానవాయిగూడెం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దానవాయిగూడెం జైలు రోడ్డు, సారథినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతి నగర్, జూబ్లీక్లబ్ రోడ్‌లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ మాల్విక ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నగరంలోని 3వ డివిజన్ పరిధిలో జయనగర్‌కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, బాలపేట,బాలపేటతండా ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ఏఈ భాస్కర్ తెలిపారు.

సన్మానం..

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ కార్యదర్శుల పనితీరుపై రెగ్యులేషన్ చేయాలని ఉత్తర్వులు జారీ చేయగా మండలంలోని చింతగుర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి భాషా ఎంపిక కావడం పట్ల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. సన్మానించిన వారిలో సర్పంచ్ మెంటం రామారావు, ఉపసర్పంచ్ కేవీఆర్, మార్కెట్ డైరెక్టర్ తాతా వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బోధకాలు నివారణ మాత్రలు

రఘునాథపాలెం/ఖమ్మంసహకారనగర్: రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెం పాఠశాల, నగరంలోని ఖాజీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోధకాలు నివారణలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు శుక్రవారం బోధకాలు నివారణ మాత్రలను విద్యార్థులచే మింగించారు. మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా ఖాజీపురంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ తెలపారు. ఈ కార్యక్రమాల్లో ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వరరావు, ముస్తఫానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఇవాంజిలిన్, సూపరింటెండెంట్ తాళ్ళూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో రాజారాంపేట సొసైటీ పరిధిలోని శుక్రవారం 96 మంది రైతులకు సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్ రూ.22 లక్షల రుణాలను అందించారు. సొసైటీ సీఈఓ ఐనంపూడి నాగేశ్వరరావు, డైరెక్టర్లు చిర్రా జయరాజు, కాటం వెంకటరెడ్డి, దిలావర్‌ఖాన్, దీరవత్ బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి గడువు పొడిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంమయూరిసెంటర్: ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి నిర్మాణాలకు షరతులు లేకుండా రూ.5 లక్షలు ఇవ్వాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు మూడు రోజులు ఇస్తే అందుకు అవసరమైన ధ్రువ పత్రాలు ఎలా సమకూరుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే ఇచ్చినట్లే ఇచ్చి పథకాన్ని అటకెక్కించే ఉద్దేశంతో ఉన్నట్లు ఉందన్నారు. దరఖాస్తుల భద్రతపై రేపటి రోజున ఎక్కడా తెలుసుకోవాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే దరఖాస్తు గడువు 20 రోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.ఝాన్సీ, ఉపాధ్యక్షురాలు ఏ.మంగతాయి, కోశాధికారి పూలమ్మ, నాయకులు సరోజిని, వసుమతి, స్వాతి, చైతన్య, లలిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు 3,742

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకానికి మండలంలో మొత్తం 3,742 దరఖాస్తులు అందాయి. మొదటి రోజు 296, రెండో రోజు 1,036, మూడో రోజు 2,400 దరఖాస్తులు వచ్చాయి. కాగా 11వ తేదీన తహసీల్‌కు వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. ఈనేపథ్యంలో గృహలక్ష్మి పథకానికి మరో 10 రోజులు గడువు పెంచాలని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని డిమాండ్ చేశారు.